ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
గురువారం 18 డిసెంబరు 2025 www.prajaswaramdailly.com 4 pm

## పరిశ్రమలో పేలుడు ఘటన..
# రెండుకు చేరిన మృతుల సంఖ్య

మనోహరబాద్ , (ప్రజాస్వరం) :



మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం రంగాయపల్లి లో గల ఎమ్ ఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో మొన్న జరిగిన బాయిలర్ బట్టి పేలుడులో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో కార్మికుడు అర్ధరాత్రి మృతి చెందాడు. బీహార్ రాష్ట్రానికి చేందిన రాజేష్ పాండే గా గుర్తించారు.మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నాడు..ఏంఎస్ అగర్వాల్ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య రెండుకు చేరుకుంది ఈ విషయంపై కంపెనీ యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని గ్రామస్థులు,సిపిఎం నాయకులు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.

# సుమోటో కేసు

### నటి నిధి అగర్వాల్ తో కొందరిఅసభ్య ప్రవర్తన



కేపీహెచ్‌బీ కాలనీ : ఓ మాల్‌లో 'ది రాజాసాబ్' సాంగ్ లాంచ్ చేసిన తర్వాత బయటికి వస్తున్న నటి నిధి అగర్వాల్ తో కొందరు అసభ్యంగా ప్రవర్తించారు. వందల మంది అభిమానులు సెల్ఫీ కోసం ఎగబడ్డారు. దీంతో అసౌక ర్యానికి గురయ్యారు. సంబంధిత వీడియో నెట్టింట చక్కర్లు కొట్టింది. ఈ ఘటనపై కేపీహెచ్‌బీ పోలీసులు సుమోటో కేసు నమోదు చేశారు. మాల్, ఈవెంట్ నిర్వాహకులు అనుమతి తీసుకోలేదని ఎస్‌హెచ్‌వో రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

## అప్పుడిప్పుడే సీఎం..
# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లరు

## మెదక్ జిల్లాలో సాగునీరు లేక రైతుల ఆందోళన

### బీఆర్ఎస్ హయాంలో బోర్లు లేవు.. కాంగ్రెస్ వచ్చాక మొదలు

### వాటి ఏర్పాటుతోనే రైతులు అప్పుల పాలు

### రుణమాఫీపై మాటతప్పిన సీఎం

### ఎలాంటి షరతులు లేకుండా రైతు బంధు ఇవ్వాలి

### మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



మెదక్ డిసెంబర్ 18 (ప్రజా స్వరం)

**సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో అప్పుడిప్పుడే సీఎం రేవంత్ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లరని మాజీ మంత్రి , సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఎద్దేవా చేశారు. 30 నుంచి 40 శాతం వరకు స్థానాలను బీఆర్ఎస్ గెల్చుకుందన్నారు.**

రేవంత్ రెడ్డి రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగుతోందని, గతంలో కేసీఆర్ పాలనలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు.మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బి ఆర్ ఎస్ పార్టీ నుంచి గెలిచిన సర్పంచులను ఆయన ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా రైతుల పరిసితి యాసంగి పంట వేయాలా వద్దా అనే దిక్కుతోచని స్థితిలో ఉన్నారని అన్నారు. ఘనపురం ఆయకట్టు సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పేరిట నీరు వదలకపోవడంతో రైతులు ఆందోళన లో ఉన్నారని అన్నారు. సింగూర్ ప్రాజెక్ట్ మెదక్, నిజామాబాద్ జిల్లా రైతులకు హక్కు అన్నారు. గతంలో సింగూర్ నీళ్ల ద్వారా మెదక్, నిజామాబాద్ జిల్లాల రైతులకు నీళ్లు బి ఆర్ ఎస్ ప్రభుత్వం అందించిందని అన్నారు. ఈ కాంగ్రెస్ వచ్చింది కష్టాలు తెచ్చిందని, బిఆర్ఎస్ హయాంలో బోర్లు వేయలేదు కాంగ్రెస్ వచ్చాక బోర్లు వేస్తూ రైతులు అప్పుల పాలు అవుతున్నారని అన్నారు. ఇప్పటికీ రైతులకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, సాగు కోసం నీళ్లు ఇవ్వండి ఇవ్వకుంటే క్రాప్ హాలీడ్ ప్రకటించి రైతులకు పరిహారం ఇవ్వాలని అన్నారు. సింగూరు నుంచి మూడు విడుతల్లో నీళ్లు ఇవ్వాలని, కానీ రెండు సార్లు ఇవ్వడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయాలడం లేదని అన్నారు. రాష్ట్రంలో పంట కొనుగోలు విషయం లో సర్కార్ ఫెయిల్ అయిందని, రైతులకు ఇవ్వాల్సిన యాసంగి, వానాకాలం బోనస్ 1200 కోట్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు యాసంగి రైతు బంధు ఎప్పుడిస్తారని, పంట వేసినోళ్ళకే రైతు బందు ఇస్తామని వ్యవసాయ మంత్రి లీకులు ఇస్తున్నారని, యాసంగి లో రైతులందరికీ రైతు బంధు డబ్బులు విడుదల చేయాలని అన్నారు.

**ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రైతు బంధు విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు తిరుపతి రెడ్డి, దేవేందర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, లింగారెడ్డి, మాజీ సర్పంచ్లు, కౌన్సిలర్స్, తదితరులు పాల్గొన్నారు.**







# కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

### బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నం

### గాంధీభవన్ వద్ద ఉద్రిక్తత.. గేటు ఎదుట బైఠాయింపు

హైదరాబాద్, ప్రజాస్వరం

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ ను ఈడీ కేసులతో వేధిస్తున్నారని దీనికి ఏఐసీసీ దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునివ్వడంతో తెలంగాణ రాష్ట్రంలో పార్టీ శ్రేణులు ఆందోళనలు చేపట్టారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్ నుంచి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు యత్నించాయి. గాంధీ భవన్ గేట్లు పోలీసులు మూసేశారు. దీంతో గాంధీ భవన్ వద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో గాంధీ భవన్ గేటు ముందు కాంగ్రెస్ నేతలు బైఠాయించారు. దీంతో భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. పలువురు నిరసన కారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనతో గాంధీభవన్ వద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్, పార్టీ రాష్ట్రవ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్, సీనియర్ నేతలు, మహిళా నేతలు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ నిర్వీర్యం చేసే కుట్ర



### స్కీమ్ ను మార్చడమంటే పేదల పొట్ట కొట్టడమే

### కేంద్రం తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి

### మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు

మెదక్ డిసెంబర్ 18 (ప్రజా స్వరం)

పేదలకు ఉపాధి కల్పించాలనే మంచి ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి పని కల్పిస్తే దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ కుట్ర చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావు మండిపడ్డారు. స్కీమ్ ను మార్చడమంటే పేదల పొట్ట కొట్టడమేనని విమర్శించారు. పార్టీ పిలుపు మేరకు బుధవారం మెదక్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు మెదక్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మ, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటున్నదని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నదని అన్నారు. పేదలు, రాష్ట్రాలను శిక్షించేలా కేంద్రం విధానం ఉన్నదన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును 'వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్)' (వీబీ–జీరామ్ జీ)గా మార్చే బిల్లును ఎమ్మెల్యే రోహిత్ రావు తప్పుబట్టారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడంలాంటి గొప్ప లక్ష్యాలతో నాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నదని మండిపడ్డారు. గతంలో వందశాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్రప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు.

# 'జీ రామ్ జీ'కి లోక్‌సభ ఆమోదం

### బిల్లు ప్రతులు చించేసిన విపక్ష ఎంపీలు

ఢిల్లీ, ప్రజాస్వరం

'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్–గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లు కు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం'ను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చారు. విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు.

